## క్లుప్తంగా

### శ్రీకృష్ణుడిని దర్శించుకున్న మంత్రి కారుమూరి



తాడిపర్రులో మంత్రి కారుమూరిని సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

**ఉండ్రాజవరం:** మండలంలో తాడిపర్రులో యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీకృష్ణుని ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఇటీవల వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు ఆలయంలో శ్రీకృష్ణుడిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంత్రి కారుమూరికి స్వాగతం పలికారు. మంత్రికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం మంత్రి అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మట్టా శ్రీనివాసు, కమిటీ సభ్యులు వంటపాటి కృష్ణమూర్తి, పాశం రామకృష్ణ, గాలి శ్రీనివాసు, నాగళ్ల బాపూజీ, వంటపాటి గోవింద్, మట్టా అంజనేయులు పాల్గొన్నారు.

### పశ్చిమ డెల్టాకు ఏడువేల క్యూసెక్కుల విడుదల



పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ

**నిడదవోలు :** వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఉభయగోదావరి జిల్లాల్లో మూడు డెల్టాలకు రైతుల వ్యవసాయ అవసరాల మేరకు నీటి విడుదలను క్రమబద్ధీకరిస్తున్నారు. దీనిలో భాగంగా ధవళేశ్వరం నీటి పారుదల శాఖ హెడ్‌వర్క్స్ అధికారులు డెల్టా కాలువలకు నీటి విడుదలను ఆదివారం పెంచారు. పశ్చిమ డెల్టాకు ఏడువేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2,500 క్యూసెక్కులు, తూర్పు డెల్టాకు 4,800 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పశ్చిమ డెల్టా పరిధిలో ఏలూరు కాలువకు 933 క్యూసెక్కులు, తణుకు కాలువకు 822 క్యూసెక్కులు, అత్తిలి కాలువకు 557 క్యూసెక్కులు, నరసాపురం కాలువకు 2,206 క్యూసెక్కులు, ఉండి కాలువకు 1,156 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

### నేడు హోం మంత్రి వనిత పర్యటన

**కొవ్వూరు:** రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత సోమవారం ఉదయం 10.30 గంటలకు చాగల్లు గ్రామంలో కార్ గ్యారేజి ప్రారంభోత్సవంలో పాల్గొంటారని కార్యాలయ సిబ్బంది తెలిపారు.11 గంటలకు చాగల్లు పంచాయతీలో నిర్వహించే ఉప సర్పంచ్ ఎన్నికకు హాజరవుతారు.12.30 గంటలకు ద్వారకాతిరుమలలో ఎస్‌వీఎస్ ఫంక్షన్‌లో నిర్వహించే విందుకి హాజరవుతారు. మధ్యాహ్నం 3.30 గంటలకు కొవ్వూరు లిటరరీ క్లబ్ కళ్యాణ మండపంలో ఆపుస్మా ఆధ్వర్యంలో నిర్వహించే గురు పూజోత్సవంలో పాల్గొంటారు.రాత్రి ఏడు గంటలకు రాజమహేంద్రవరంలో చెరుకూరి కళ్యాణ మండపంలో ప్రైవేటు ఫంక్షన్‌కి హాజరవుతారు.8.30 గంటలకు ఏలూరులో బైపాస్‌రోడ్డులోని ఫంక్షన్‌హాలులో ఓ ప్రైవేటు ఫంక్షన్‌కి హాజరుతారు.

### పిడుగు పడి ఎలక్ట్రానిక్ పరికరాల ధ్వంసం

**పెరవలి:** పెరవలి మండలంలో శనివారం అర్ధరాత్రి నుంచి ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడి భారీ వర్షం కురిసింది. మండలంలోని పలు గ్రామాల్లో పిడుగు పాటుకు అనేక ఎలక్ట్రానిక్ వస్తువులు ధ్వంసం అయ్యాయి. నల్లాకులవారిపాలెంలో మాజీ సర్పంచ్ కోపెల్ల వెంకటేశ్వరరావు ఇంటిపై పిడుగు పడి ఇంట్లో ఉన్న ఫ్యాన్లు, ఏసీ, టీవీ, రిఫ్రిజిరేటర్ వంటి ఎలక్ట్రానిక్స్ వస్తువులు కాలిపోవడంతో పాటు భవనానికి బీటలు ఏర్పడ్డాయి.

### యువతి అదృశ్యంపై కేసు

**నిడదవోలు రూరల్:** మండలంలోని పురుషోత్తపల్లికి చెందిన యువతి అదృశ్యంపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ ఆదివారం తెలిపారు. పురుషోత్తపల్లికి చెందిన దిడ్ల బంగారయ్య కుమార్తె ఆగస్టు 24న కోరుమామిడి గ్రామానికి చెందిన మేనత్త ఈదూరి కరుణ ఇంటికి వెళ్లింది. అక్కడ నుంచి బయటకు వెళ్తానని చెప్పి తిరిగి రాకపోవడంతో బంగారయ్య పోలీసులను ఆశ్రయించారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదుపై మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### మెగా జాబ్‌మేళా

**కంబాలచెరువు:** స్థానిక రాజీవ్ గాంధీ కళాశాలలో ఆదివారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. రెండు రోజులు పాటు జరిగే ఈ కార్యక్రమానికి నిరుద్యోగులు వినియోగించుకోవాలని విద్యాసంస్థల చైర్మన్ జీవీ హర్షకుమార్ తెలిపారు. విప్రో, గన్ ఫ్యాక్ట్, టెలి పెర్ఫార్మెన్స్, హైటెక్ టెక్నాలజీ, టెక్‌వే సాఫ్ట్‌వేర్, ముత్తూట్ గ్రూప్, శ్రీజీ హైయర్ సర్వీస్, బిట్స్ సాఫ్ట్ సొల్యూషన్స్ తదితర 55 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. సుమారు 700 మంది అభ్యర్థులు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు జీవీ శ్రీరాజ్, జీవీ సుందర్, ప్రిన్సిపల్ మేరీజోన్స్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ కాలనీలో డ్రెయినేజీ సమస్యకు మోక్షం

- ఎమ్మెల్యే చొరవతో వెంకటకృష్ణాపురం వాసులకు తొలగిన ఇక్కట్లు
- రూ.30 లక్షలతో చేపట్టిన నిర్మాణ పనులు పూర్తి
- ప్రజలకు వరంగా మారిన.. గడప గడపకూ కార్యక్రమం



రహదారి పక్కన నిర్మించిన డ్రెయినేజీ



చెరువులోకి నీరు పారేందుకు వీలుగా రహదారి మధ్యలో నిర్మించిన కల్వర్టు

**ద్వారకాతిరుమల:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికైంది. మండలంలోని వెంకటకృష్ణాపురంలో తిష్టవేసిన ఏళ్లనాటి సమస్యకు ఈ కార్యక్రమం ద్వారా పరిష్కారం లభించింది. స్థానిక బీసీ కాలనీ వాసులను దశాబ్దాల కాలంగా డ్రెయినేజీ సమస్య వేధిస్తోంది. ఇళ్ల వద్ద, రహదారి పక్కన డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయేది. వర్షం వస్తే నీరు ఇళ్లల్లోకి చేరడంతో స్థానికులు ఇబ్బంది పడేవారు. ఈ సమస్యలన్నిటికీ డ్రెయినేజీలు లేకపోవడమే కారణమని కాలనీ వాసులు అధికారులకు చెప్పేవారు. అయినా ఆ సమస్యకు చెక్ పడలేదు. 2019లో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన టీడీపీ నేతలను సైతం కాలనీ వాసులు దీనిపై నిలదీశారు. గతేడాది జూన్ 1న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కాలనీలో ఇంటింటికీ వెళ్లిన గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు వద్ద ఆ ప్రాంత వాసులు డ్రెయినేజీ సమస్యపై ఏకరువు పెట్టారు.

**హామీ ఇచ్చిన వెంటనే కార్యరూపం**

హామీ ఇచ్చిన వెంటనే ఎమ్మెల్యే తలారి గడపగడపకు నిధులు రూ. 20 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలను డ్రెయినేజీ నిర్మాణానికి కేటాయించారు. కాలనీకి దిగువ ప్రాంతంలో పంట పొలాలు ఉండటంతో అక్కడి రైతులు డ్రెయినేజీ నిర్మాణానికి అభ్యంతరం తెలిపారు. దాంతో నల్లజర్లకు చెందిన ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ విభాగ అధికారులతో ఎమ్మెల్యే చర్చించి, సమస్య పరిష్కారానికి మార్గాన్ని అన్వేషించారు. ఎగువ ప్రాంతంలో ఉన్న చెరువులోకి మురుగునీరు పారేలా ప్లాన్‌ను రూపొందించి, దానికి అనుగుణంగా డ్రెయినేజీ నిర్మాణ పనులను 40 రోజుల క్రితం చేపట్టారు. ఈ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. దాంతో తమ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తోందని కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి



ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చొరవతోనే డ్రెయినేజీ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మెరక ప్రాంతం మీదుగా మురుగు నీరు పారడం సాధ్యం కాదని గతంలో ఎంతో మంది అధికారులు, ప్రజాప్రతినిధులు చేతులెత్తేశారు. ఎమ్మెల్యే తలారి పట్టు విడవకుండా సమస్య పరిష్కారానికి కృషి చేసారు.

– సర్నాల శ్రీరామమూర్తి, వెంకటకృష్ణాపురం, బీసీ కాలనీ

### నిర్మాణ పనులు వేగవంతం



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వచ్చిన ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు డ్రెయినేజీ సమస్యలను విన్నవించాం. గత నాయకుల వలే ఆయన కూడా పట్టించుకోరని అనుకున్నాం. ప్రత్యేక దృష్టి సారించి, డ్రెయినేజీల నిర్మాణాలకు ఆయన శ్రీకారం చుట్టి పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. – ఎస్.తులసి, వెంకటకృష్ణాపురం, బీసీ కాలనీ

### శాశ్వత పరిష్కారం చూపారు



బీసీ కాలనీలో డ్రెయినేజీలు నిర్మిస్తారని అనుకోలేదు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎమ్మెల్యే తలారి మా సమస్యకు శాశ్వత పరిష్కార మార్గాన్ని చూపారు. రూ. 30 లక్షలు వెచ్చించి, డ్రెయినేజీలను నిర్మిస్తున్నారు. నిన్నుమొన్నటి వరకు ఇళ్లలోని మురుగునీరు, వర్షపు నీరు బయటకు పారక ఎన్నో ఇబ్బందులు పడ్డాము.

– ఎస్.కృష్ణవేణి, వెంకటకృష్ణాపురం, బీసీ కాలనీ

### గౌడీయ మఠంలో రాధాకృష్ణుల డోలోత్సవం



కొవ్వూరులో శ్రీరామానంద గౌడీయ మఠంలో ఉయ్యాలలో రాధాకృష్ణులు

**కొవ్వూరు:** పట్టణంలో శ్రీరామానంద గౌడీయ మఠంలో ఆదివారం రాధాకృష్ణుల డోలోత్సవం, రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మఠం నిర్వాహకులు విబుధ వామన మహారాజు ఆధ్వర్యంలో భజనలు, శ్రీకృష్ణ నామాన్ని స్మరిస్తూ కీర్తనలు ఆలపించారు. ఆర్‌వీ కామేశ్వర శర్మ భాగవత ఉపన్యాసం అందించారు.7న శ్రీకృష్ణ జయంతి మహోత్సవం, సెప్టెంబర్ 8న నందమహారాజు ఆనందోత్సవం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. డోలోత్సవంలో భాగంగా రాధాకృష్ణుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉయ్యాలలో ఉంచారు. భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

### నేడు గణేశ్ ఉత్సవాలకు రాట ముహూర్తం

**నిడదవోలు :** పట్టణంలో గణేశ్ చౌక్ సెంటర్లో పూజ గణపతి కుమారస్వామి ఆలయంలో 101వ సంవత్సర గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 9.26 గంటలకు స్వామివారి రాట ముహూర్త కార్యక్రమంతో ఉత్సవాలను ప్రారంభిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు ఆదివారం తెలిపారు. పట్టణ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆలయ కమిటీ పేర్కొంది.

## నేడు ప్రైవేటు ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం

**కొవ్వూరు:** పట్టణంలో లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో సోమవారం 3 గంటలకు ఏపీ ప్రైవేటు, అన్ ఎయిడెడ్ స్కూళ్ల మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహిస్తామని సంఘం జోనల్ చైర్మన్ నెల్సన్ ఆంటోనీ తెలిపారు. జోన్ పరిధిలోని ప్రైవేటు,అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉత్తమ సేవలందించిన నలభై మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి అవార్డులు అందజేస్తామని ఆయన తెలిపారు. రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.హైస్కూలు స్థాయిలో ఇద్దరు చొప్పున, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల స్థాయిలో ఒక్కొక్కరు చొప్పున జోన్‌లో నలభై మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఈ అవార్డులు అందజేస్తున్నట్లు ఆంటోనీ ఆదివారం తెలిపారు.

**ఆత్మీయ హితకారిణి సమాజం ఆధ్వర్యంలో..**

స్థానిక సంస్కృత పాఠశాలలో ఈనెల ఐదో తేదీన గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేయనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు ఎస్ఎస్ వాజ్‌పేయి తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు సంస్కృత పాఠశాల ఆవరణలో ఈ అవార్డులు ప్రదానం చేస్తామని తెలిపారు.జీవీ కృష్ణమూర్తి స్మారక, రాచర్ల వెంకట్రావు సార్మక ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేస్తామని ఆయన తెలిపారు.

### శ్రీకృష్ణుడి గుడి వద్ద షెడ్డు నిర్మాణం

**కొవ్వూరు:** వాడపల్లిలో శ్రీకృష్ణ ఆలయంలో మాజీ సర్పంచ్ బూరుగుపల్లి సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారులు మాజీ ఏఎంసీ చైర్మన్ వీర్రాఘవులు, శ్రీనివాసరావు సోదరులు ఆలయ ప్రాంగణంలో షెడ్డు నిర్మించారు. ఈ షెడ్డును టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్ ప్రారంభించారు. 65 కిలోల పంచలోహ విగ్రహం, మకర తోరణం శ్రీకృష్ణుడికి వెండి కిరీటాన్ని గ్రామస్తుల సహకారంతో సమకూర్చారు. ఈ సందర్భంగా వీర్రాఘువుల దంపతులు చేతుల మీదుగా ఆలయం వద్ద ఆదివారం శాంతి హోమం నిర్వహించారు.

## గోగులమ్మవారికి శ్రావణ సారె సమర్పణ



కాటకోటేశ్వరంలో గోగులమ్మకు శ్రావణ సారె సమర్పించేందుకు ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

**నిడదవోలు రూరల్:** కాటకోటేశ్వరం గ్రామదేవత గోగులమ్మవారికి శ్రావణమాసం సందర్భంగా భక్తులు ఆదివారం శ్రావణ సారె సమర్పించారు. గోగులమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, చీరలు, చలివిడి, పానకం సమర్పించి మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారి సారెతో ఊరేగింపు నిర్వహించారు.

## పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో అపశృతి



ఏలూరు ఆశ్రం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు నరేంద్ర

- మోటార్ సైకిల్‌తో కారును ఢీకొట్టిన బాలుడు

**ద్వారకా తిరుమల:** జనసేన అధినేత పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది. ద్వారకా తిరుమలలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న ఒక బాలుడు రోడ్డు ప్రమాదానికి గురై, తీవ్ర గాయాలు పాలయ్యాడు. వివరాల్లోకి వెళితే. క్షేత్రంలో శనివారం రాత్రి పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ శ్రేణులు నిర్వహించారు. ఈ సందర్భంగా కొంత మంది యువకులు చేసిన హడావిడి స్థానికులను, పెళ్లి జనాలను భయాందోళనకు గురిచేసింది. సైలెన్సర్లు తీసేసిన బైక్‌లను రోడ్లపై అతివేగంగా నడుపుతూ హల్‌చల్ చేశారు. ఆ సమయంలో అటుగా ప్రయాణించిన వాహనదారులు, పెళ్లి జనాలు ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని భయాందోళన చెందారు. ఈ వేడుకల్లో పాల్గొన్న మండలంలోని దొరసానిపాడుకు చెందిన 15 ఏళ్ల బాలుడు బంటుమిల్లి నరేంద్ర బైక్‌పై వేగంగా తిరుగుతూ స్థానిక సొసైటీ పెట్రోల్ బంక్ సమీపంలో ఒక కారును ఢీకొట్టాడు. దాంతో అతడి కుడి కాలు రెండు చోట్ల విరిగిపోవడంతో పాటు, తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు హుటాహుటిన క్షతగాత్రుడిని తొలుత ద్వారకాతిరుమల శివారు లక్ష్మీపురంలోని విర్డ్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ఆశ్రం ఆస్పత్రికి తరలించి, చికిత్సనందిస్తున్నారు.

### కొండ చిలువ హతం



కొండ చిలువను హతమార్చిన ఇందిరమ్మ కాలనీవాసులు

**గోపాలపురం:** గోపాలపురం ఇందిరమ్మ కాలనీ సమీపంలోని పొలంలో ఆదివారం 15 అడుగుల కొండ చిలువను స్థానికులు గుర్తించి హతమార్చారు. కొంతకాలంగా స్థానిక కోళ్లఫారంలోని కోళ్లను ఈ కొండచిలువ మింగేస్తోందని స్థానికులు తెలిపారు.

### హెచ్‌ఐవీ నిర్ధారణ పరీక్షలు

**చాగల్లు:** హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కలవలపల్లి సొసైటీ అధ్యక్షుడు గూడపాటి శివ అన్నారు. మండలంలో కలవలపల్లిలో ఆదివారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో గర్భిణులకు, ప్రజలకు ఉచితంగా హెచ్‌ఐవీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి, ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీవారి క్షేత్రంలో పెళ్లిళ్ల సందడి



శ్రీహరి కళాతోరణ ప్రాంతంలో వివాహాలు నిర్వహిస్తున్న దృశ్యం

**ద్వారకా తిరుమల:** ఇసుక వేస్తే రాలనంత జనం.. ఎటుచూసినా పెళ్లి జనాలే.. రోడ్లన్నీ వాహనాలతో కిక్కిరిసాయి. ఇదీ ద్వారకా తిరుమల చినవెంకన్న క్షేత్రంలో శనివారం రాత్రి పరిస్థితి. శ్రావణ మాసంలో అతిపెద్ద ముహూర్తం కావడంతో క్షేత్రంలో సుమారు 200 పైగా వివాహాలు జరిగాయి. పెళ్లివారి వాహనాలతో ఘాట్ రోడ్లు, ప్రధాన రహదారులన్నీ కిక్కిరిసాయి. ఆదివారం ఉదయం క్షేత్రంలో పెళ్లిళ్లు అధిక సంఖ్యలో జరిగాయి. వివిధ ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న కొత్త జంటలు, వారి బంధువులు స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు.

## ధ్యానం సర్వ రోగ నివారిణి



ధ్యానం ఆవశ్యకతను వివరిస్తున్న శిక్షకుడు

**చాగల్లు:** సమాజంలో ప్రతి ఒక్కరూ సహజంగా జీవించడం అలవాటు చేసుకోవాలని సీనియర్ పిరమిడ్ మాస్టర్ గౌతం అన్నారు. మండలంలో ఎస్ ముప్పవరంలో నిడదవోలు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూమెంట్ ఆధ్వర్యంలో ఉచిత ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన పిరమిడ్ మాస్టర్ గౌతం మాట్లాడుతూ ధ్యానం ద్వారా ప్రశాంతతో పాటు సంపూర్ణ ఆరోగ్యం బుద్ధి కుశలత, ఆధ్యాత్మిక జ్ఞానం వృద్ధి చెందుతుందన్నారు. ధ్యానం సర్వ రోగ నివారిణి, ధ్యానం సత్యజ్ఞాన ప్రసాదిని, సకల భోగాల ప్రసాదిని అని వివరించారు. ధ్యానం చేయడం వల్ల శారీరక, నాడీమండల శుద్ధి సాధ్యమవుతుందన్నారు. నిడదవోలు పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఏంఎ ప్రసాద్ మాట్లాడుతూ ధ్యానం వల్ల కలిగే లాభాలు వివరించారు. ఈ కార్యక్రమంలో జి. బుల్లి తాతారావు, విజయలక్ష్మి, గంగాభవానీ, ఎ సత్యనారాయణ, బి.సత్యనారాయణ, ఏం.సీతా నాగేంద్ర, చాగల్లు, దారవరం, పశివేదల, ఊనగట్ల, నిడదవోలు తదితర ప్రాంతాల నుంచి ధ్యానులు పాల్గొన్నారు.

### శ్రీవారి సేవలో సినీ సంగీత దర్శకుడు పట్నాయక్



శ్రీవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న సినీ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్

**ద్వారకాతిరుమల:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల చినవెంకన్న ఆలయాన్ని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ ఆదివారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు వేద ఆశీర్వచనాన్ని పలికి, శ్రీవారి ప్రసాదాలను అందజేశారు.

## హర్యానాలో ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

**చాగల్లు:** హర్యానా రాష్ట్రంలో ఆశా వర్కర్లు ఆగస్టు 8వ తేదీ నుంచి సమస్యలు పరిష్కరించాలని నిరవధిక సమ్మె చేస్తున్నా అక్కడి ప్రభుత్వం స్పందించడం లేదని సీఐటీయూ ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కే పోశమ్మ తెలిపారు. హర్యానా ఆశా వర్కర్లకు మద్దతుగా ఈనెల 5 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు పోశమ్మ తెలిపారు. చాగల్లులో ఆదివారం ఆశా వర్కర్ల యూనియన్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ హర్యానాలో ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆగస్టు 27న శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకులపై దారుణంగా పోలీసులు లాఠీ చార్జీ చేసి అక్రమంగా అరెస్టులు చేశారన్నారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రికి రాష్ట్రవ్యాప్తంగా ఆశ వర్కర్లు మెయిల్ ద్వారా వినతిపత్రాలు పంపిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశానికి వెంకటలక్ష్మి, కస్తూరి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## తెలుగు ఉపాధ్యాయుడికి ఉత్తమ అవార్డు



పంగిడిగూడెం హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు పెద్దిరాజును సత్కరిస్తున్న లయన్స్ ప్రతినిధులు

**ద్వారకా తిరుమల:** గురుపూజ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పంగిడిగూడెం హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు మద్దాల పెద్దిరాజుకు జిల్లా లయన్స్ క్లబ్ వారు ఏలూరులోని తమ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందజేశారు. అనంతరం దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించి, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. విద్యా రంగానికి, విద్యా వ్యాప్తికి, విద్యార్థుల ఉన్నతికి చేస్తున్న కృషి, సామాజిక సేవలకు గాను ఈ అవార్డును అందించినట్టు లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గట్టెం మాణిక్యాలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, డీఈఓ శ్యామ్ సుందర్, లయన్స్‌క్లబ్ సభ్యులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### వైభవంగా సామూహిక వివాహాలు



ఆలయ ఆవరణలో నూతన జంటలు

**సీటీఆర్ఐ:** స్థానిక కోరుకొండ రోడ్డులోని సింహాచల నగర్ వరాహ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో వరాహ లక్ష్మీ నృసింహస్వామి ట్రస్ట్ (శ్రీ మధుభయ వేదాంతాచార్య పీఠం ట్రస్ట్, శ్రీరంగం) ఆధ్వర్యాన ఆదివారం కల్యాణమస్తు పేరిట సామూహిక ఉచిత వివాహాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు కాలెపు సూర్యసింహాచలం, నాగేశ్వరరావు సారథ్యంలో ఆరు జంటలకు ప్రధానార్చకుడు అవసరాల శ్రీకిరణాచార్యులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఉదయం 10.39 గంటల సుముహూర్త సమయాన వధూవరులతో జీలకర్ర, బెల్లం పెట్టించారు. సూత్రధారణ, తలంబ్రాలు, పాణిగ్రహణం, అరుంధతి నక్షత్ర వీక్షణం వంటి క్రతువులు సంప్రదాయబద్ధంగా చేయించారు. బంగారు మంగళ సూత్రం, వెండిమట్టెలు, పెండ్లి వస్త్రాలు, తలంబ్రాలతో సహా పెళ్లి సామగ్రి ఉచితంగా ఆలయం తరపున అందజేశారు.

### మోదీ పాలనలో సామాన్యుల తిప్పలు

**సీటీఆర్ఐ:** కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెరిగిన గ్యాస్, డీజిల్, పెట్రోల్ నిత్యావసరాల ధరలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు, పీసీసీ సభ్యుడు, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాలేపల్లి మురళీధర్ అన్నారు. స్థానిక కృష్ణానగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పుడు ప్రధాని మోదీ గ్యాస్ సిలిండర్‌పై రూ.200 ధర తగ్గింపు పేరుతో మళ్లీ కొత్త డ్రామాకు తెరతీశారన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

### కిక్ బాక్సింగ్‌లో కాంస్య పతకం



సాగర్, వెంకటరమణను అభినందిస్తున్న బ్రహ్మయ్య

**రాజమహేంద్రవరం రూరల్:** జార్ఖండ్‌లోని తానా భగత్ ఇండోర్ స్టేడియంలో గత నెల జరిగిన కిక్ బాక్సింగ్ చిల్డ్రన్స్ అండ్ జూనియర్ జాతీయస్థాయి చాంపియన్‌షిప్‌లో బొమ్మూరు మారుతి సెల్ఫ్ డిఫెన్స్ విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో ఎస్.రుత్విక్ వీరసాగర్ +36 కేజీల లైట్ కాంటాక్ట్ విభాగంలో కాంస్య పతకం సాధించాడు. ఈ జాతీయస్థాయి పోటీలకు టటామి రిఫరీగా వ్యవహరించిన ఎస్.గిరివెంకట రమణకు ఏగ్రేడ్ రిఫరీగా ప్రశంసాపత్రాన్ని అందించారు. కాగా.. రుత్విక్ వీరసాగర్, కోచ్ ఎస్.గిరివెంకట రమణను ఆదివారం గోకుల్ రియల్ ఎస్టేట్ అధినేత ముంగమూరి బ్రహ్మయ్య అభినందించారు.

### ప్రత్యేక పుష్పాలంకరణలో కోటసత్తెమ్మ

**నిడదవోలు రూరల్:** నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మవారి ఆలయానికి శ్రావణమాసం పురస్కరించుకుని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఈఓ బళ్ల నీలకంఠం(శివ) తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో కోటసత్తెమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టికెట్లు, ఫొటోల విక్రయం ద్వారా రూ.1,20,656 ఆదాయం ఆలయానికి వచ్చిందని తెలిపారు. ఈనెల 8న అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మహిళలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు.